సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 26 । ఏప్రిల్ । 2024



'సమీకృత'తో అధిక లాభాలు

సమీకృత సాగుతో అధిక లాభాలు సాధించొచ్చని కేవీకే కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. - IIలో



కాంగ్రెస్‌తోనే సమాచార చట్టం

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే దేశంలో సమాచార హక్కు చట్టం సాధ్యమైందని డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. - IIలో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం

42^0 / 27^0

ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



వట్టిఖమ్మంపహాడ్ ఐకేపీ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చివ్వెంల(సూర్యాపేట): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. గురువారం చివ్వెంల మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వట్టి ఖమ్మంపహాడ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించి మాట్లాడారు.సెంటర్ల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ఆమె వెంట డీసీఓ పద్మ, నిర్వాహకులు బయ్యు పద్మ, పేర్ల మల్లీశ్వరీ, యల్క కృష్ణారెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మానసాదేవి విగ్రహ ప్రతిష్ఠ



మాట్లాడుతున్న దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశం గుప్త, మురళీధర్

భానుపురి (సూర్యాపేట): పట్టణంలోని సంతోషిమాత దేవాలయంలో శుక్రవారం మానసాదేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశంగుప్త, బ్రాహ్మండ్లపల్లి మురళీధర్ తెలిపారు. గురువారం దేవాలయంలో ఏర్పాటు చేసిన కమిటీ, భక్తుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పుష్పగిరి పీఠాధిపతి శ్రీజగద్గురు విద్యాశంకర భారతి మహాస్వామి రానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు బెలిదే అశోక్, సోమ శ్రీశైలం, తాళ్లపల్లి రామయ్య, దేవరశెట్టి సోమయ్య, గోపారపు రాజు, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, మహంకాళీ ఉపేందర్, ముదిరెడ్డి లింగారెడ్డి, నాగమణి, ప్రభావతి, కవిత పాల్గొన్నారు.

అన్నీ బంద్ చేసిన్రు..

- చేనేతను పట్టించుకుంటలేరు
- రైతులకు సరిగా నీళ్లివ్వలేదు
- కరెంట్‌ను నాశనం చేసిన్రు
- గురుకులాల్లో కల్తీ అన్నం పెడుతున్రు
- భువనగిరి కార్నర్ మీటింగ్‌లో ప్రభుత్వంపై కేసీఆర్ ధ్వజం
- బస్సు యాత్రతో కేడర్‌లో జోష్



భువనగిరిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కేసీఆర్, చిత్రంలో అభ్యర్థి క్యామ మల్లేష్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : 'చేనేత కార్మికులకు త్రిఫ్ట్ పథకం ఇచ్చినం.. సగం ధరకే రంగులు, రసాయనాలు అందజేసి వాళ్ల బతుకులు కాపాడినం.. కాంగ్రెస్ సర్కార్ వచ్చినాక అన్నీ బంద్ చేసిన్రు.. ఇంకా కూడా బంద్ అవుతాయి' అని భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ధ్వజమెత్తారు. రైతులకు సరిగా నీళ్లివ్వలేదు.. మంచిగ నడిచే కరెంట్‌ను నాశనం చేసి పొలాలను ఎండ బెట్టారని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర గురువారం సాయంత్రం భువనగిరికి చేరుకుంది. ఈ సందర్భంగా రోడ్ షో, అనంతరం వినాయక చౌరస్తాలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బాయిల పూడిక తీసే క్రేన్లు మళ్లీ ఊర్లకు వస్తున్నాయని, రైతుబంధు పోయిందని, పంటను కొనే దిక్కులేదన్నారు. రైతులు మళ్లీ రాత్రి పూట వెళ్లి కరెంట్ పెట్టే దుస్థితి వచ్చిందన్నారు. కేసీఆర్ పక్కకు జరగగానే కట్కా ఏసినట్లు కరెంట్ బంద్ పెడుతావా.. ఏ మాత్రం చేతనవడం లేదా.. తొమ్మిదేళ్లుగా తొవ్వపడింది.. పడ్డ తొవ్వనుంచి నడువడం తెలువదా? అని ప్రశ్నించారు. 2014కు ముందు తెలంగాణలో రైతులు ఆత్మహత్యలు చేసుకునే వారు.. వలసలు పోయేటోళ్లు.. నేను వచ్చిన తర్వాత ఇవన్నీ బంద్ అయ్యేటట్లు చేసిన... తెలంగాణ మంచిగ అయ్యిందని జనం సంతోషపడ్డరని పేర్కొన్నారు. కాంగ్రెస్ వచ్చినప్పటి నుంచి రాత్రి పూట కరెంట్ పెట్టబోయి, పొలాలు ఎండి గుండె ఆగిపోయి 225 మంది రైతుల సచ్చిపోయారని తెలిపారు. మేము ఉన్నప్పుడు రైతు సచ్చిపోతే బాధిత కుటుంబానికి వారం రోజుల్లో రూ.5 లక్షలు వచ్చినయి, ఇప్పుడు ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలకు రైతులు కనబడడం లేదన్నారు. నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఇచ్చారా? అని ప్రశ్నించారు. గురుకులాల్లో కల్తీ అన్నం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత ఆహారం తిని 130 మంది విద్యార్థులు దవాఖానాలో పడగా నలుగురు చనిపోయారని పేర్కొన్నారు. భువనగిరిలో కూడా ఒక అబ్బాయి చనిపోయాడని, ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఏం చేస్తుందని దుయ్యబట్టారు.



రోడ్ షోలో బస్సులో నుంచి ప్రజలకు నమస్కరిస్తున్న కేసీఆర్, క్యామ మల్లేష్

వివేరాలో సమీక్ష

గురువారం సూర్యాపేట నుంచి బయలుదేరిన బస్సు యాత్ర.. సూర్యాపేట జిల్లా అర్వపల్లి, తిరుమలగిరి, జనగామ జిల్లా దేవరుప్పల, జనగామ, యాదాద్రి జిల్లా ఆలేరు మీదుగా భువనగిరికి చేరుకుంది.ఈ సందర్భంగా స్థానిక వివేరా హోటల్‌లో నాయకులతో సమీక్ష నిర్వహించారు. పార్టీ అభ్యర్థి విజయం కోసం పాటుపడాలని దిశానిర్దేశం చేశారు.

జోష్ నింపిన కేసీఆర్ ప్రసంగం

కేసీఆర్ మాట్లాడుతుండగా కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. ఇక్కడ చూపించే జోష్‌తో ఓట్లు వేయించాలని కేసీఆర్ కోరారు. సభ ముగిసిన అనంతరం భువనగిరి నుంచి ఎర్రవెల్లిలోని తన ఫాంహౌజ్‌కు కేసీఆర్ బస్సులోనే వెళ్లారు. మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత.. ఒకటే జననం, ఒకటే మరణం పాటపాడగా.. గాదరి కిశోర్ డ్యాన్స్ చేసి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. రోడ్‌షోలో భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేష్, సూర్యాపేట, జనగామ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎలిమినేటి ఉమామాధవరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత, బూడిద భిక్షమయ్య గౌడ్, గాదరి కిషోర్‌కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, ఆలేరు.భువనగిరి, మునుగోడు, ఇబ్రహీంపట్నం, నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



భువనగిరిలో జరిగిన కార్నర్ మీటింగ్‌కు భారీగా హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు

పేటలో ముగిసిన కేసీఆర్ టూర్

సూర్యాపేట : బీఆర్‌ఎస్ నల్లగొండ లోక్ సభ నియోజకవర్గ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి మద్దతుగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన సూర్యాపేట జిల్లా పర్యటన బుధవారం ముగిసింది. మంగళవారం రాత్రి ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నుంచి పోస్టాఫీస్ చౌరస్తా వరకు రోడ్ షో నిర్వహించి అక్కడ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేశారు. గురువారం మధ్యాహ్నం 3గంటల నుంచి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి ఫొటోలు దిగారు. సాయంత్రం 4గంటల సమయంలో భువనగిరిలో జరగనున్న రోడ్‌షోకు అర్వపల్లి, తిరుమలగిరి మీదుగా బస్సులో బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఉన్నారు.

మే 27న ఎమ్మెల్సీ ఎన్నికలు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- వచ్చే నెల 2న నోటిఫికేషన్ జారీ
- అదే రోజు నుంచి 9వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- మూడు జిల్లాల్లో 4,61,806 మంది ఓటర్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు మే 27వ తేదీన జరుగనున్నాయి. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి డిసెంబర్ 9వన రాజీనామా చేశారు. నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తే ఆరు నెలల్లో మళ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీంతో ఎన్నికల సంఘం మార్చి వరకు ఓటరు జాబితా తయారీలో నిమగ్నమైంది. తాజాగా ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసింది.

నోటిఫికేషన్ విడుదల రోజు నుంచే నామినేషన్లు

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మే 2వ తేదీన నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది. అదే రోజు నుంచి మే 9వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఆ తరువాత 10వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఇస్తారు. అదే రోజు అభ్యర్థుల ఫైనల్ జాబితా ప్రకటించనున్నారు. మే 27వ తేదీన ఎన్నికకు పోలింగ్ జరగనుంది. జూన్ 5న ఓట్ల లెక్కింపు చేపడతారు.

మూడు ఉమ్మడి జిల్లాల ఓటర్లు ఇలా..

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉమ్మడి జిల్లాలోని 12 కొత్త జిల్లాల పరిధిలో మొత్తం 4,61,806 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. జనవరి నెల నుంచే ఉప ఎన్నికకు సంబంధించి ఎన్నికల సంఘం కొత్తగా ఓటర్ల జాబితాను తయారు చేసింది. 2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 5,05,505 ఓటర్లుండగా అందులో 3,85,996 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. 76.35 శాతం పోలింగ్ నమోదైంది. ఆ ఓటర్ల జాబితాను రద్దు చేసి మళ్లీ కొత్తగా పట్టభద్రులందరి నుంచి ఓటు నమోదుకు ఎన్నికల సంఘం దరఖాస్తులు స్వీకరించింది. దీంతో ఈ మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో గల 12 కొత్త జిల్లాల్లో (సిద్దిపేట జిల్లాలోని ఐదు పోలింగ్ స్టేషన్ల పరిధిలోనే) ఇప్పటి వరకు 4,61,806 మంది ఓటర్లు మాత్రమే ఓటును నమోదు చేసుకున్నారు. ఇందులో పురుషులు 2,87,007, మహిళలు 1,74,794 మంది పట్టభద్రులు ఉన్నారు. కాగా ట్రాన్స్‌జెండర్లు మరో ఐదుగురు ఉన్నారు. మొత్తం 600 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

జిల్లాల వారీగా ఓటర్లు..

జిల్లా	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
సిద్దిపేట	3,118	1,553	0	4,671
జనగామ	14,862	8,457	1	23,320
హనుమకొండ	25,608	17,875	0	43,483
వరంగల్	26,907	16,687	0	43,594
మహబూబాబాద్	22,842	11,917	0	34,759
ములుగు	6,558	3,679	0	10,237
భూపాలపల్లి	7,956	4,504	0	12,460
భద్రాద్రి	22,486	17,412	0	39,898
ఖమ్మం	50,517	33,085	4	83,606
భువనగిరి	20,740	13,186	0	33,926
సూర్యాపేట	34,043	17,250	0	51,293
నల్లగొండ	51,370	29,189	0	80,559
మొత్తం	2,87,007	1,74,794	5	4,61,806

ముగిసిన నామినేషన్ల పర్వం

- నల్లగొండ లోక్‌సభ స్థానానికి 56 మంది 114 సెట్ల నామినేషన్ల దాఖలు
- భువనగిరిలో 59 మంది అభ్యర్థులు 110 సెట్లు సమర్పణ
- నేడు పరిశీలన
- 29 వరకు ఉపసంహరణ గడువు



నల్లగొండ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి తరఫున నామినేషన్ వేస్తున్న నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్

నల్లగొండ: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల పర్వం గురువారం ముగిసింది. ఈ నెల 18 ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. చివరి రోజు గురువారం నల్లగొండ లోక్‌సభ స్థానానికి 31మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరిచందనకు సమర్పించారు. ఇప్పటివరకు మొత్తం 56 మంది అభ్యర్థులు 114 నామినేషన్ సెట్లను సమర్పించారు. అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి 4 సెట్ల నామినేషన్లు,, ఆయన తండ్రి మాజీ మంత్రి జానారెడ్డి మరో 4 సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి 3 సెట్లు, కృష్ణారెడ్డి తరఫున ఆయన సోదరుడు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఒక నామినేషన్ వేశారు. బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి 4 సెట్లు, ఆయన తరఫున పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి, మరో నాయకుడు మరో 4 సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. కాగా.. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 29 వరకు గడువు ఉంది.

భువనగిరిలో..

భువనగిరి టౌన్: భువనగిరి లోక్‌సభ స్థానానికి చివరి రోజు గురువారం 35 మంది అభ్యర్థులు 37 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 18 నుంచి గురువారం వరకు మొత్తంగా 59 మంది అభ్యర్థులు 110 సెట్ల నామినేషన్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు సమర్పించారు. ఇందులో ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు ఇతరులు కొందరు ఒకటి నుంచి మూడు వరకు నామినేషన్లు దాఖలు చేశారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- కలెక్టర్ వెంకటరావు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు

సూర్యాపేట: పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి వివిధ రాజకీయ పార్టీల నేతలతో లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ముందస్తు సమాచారం అందిస్తామని, ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులకు తెలపాలన్నారు. వయోవృద్ధులు ఇప్పటివరకు 344 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, ఆయా పార్టీల ప్రతినిధులు చకిలం రాజేశ్వరరావు, సవరాల సత్యనారాయణ, కోట గోపి, అబీద్, స్టాలిన్, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఓటరు స్లిప్పులు అందాలి

భానుపురి (సూర్యాపేట): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఎల్‌ఓలు ప్రతి ఇంటికీ ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని కలెక్టర్ వెంకటరావు సూచించారు. గురువారం క్యాంప్ కార్యాలయం నుంచి వెబెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఈ నెల 25 నుంచి 28 వరకు ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్, కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, హుజూర్ నగర్ ఆర్డీఓ శ్రీనివాస్ రావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఎలాంటి ప్రలోభాలకు గురికావొద్దు

ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ వెంకటరావు, ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఓటు ఆవశ్యకతపై నిర్వహించిన జిల్లా స్థాయి డ్రాయింగ్, పెయింటింగ్ పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, స్వీప్ నోడల్ అధికారి అశోక్, డీఐఈఓ కృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి

సూర్యాపేట టౌన్: విద్యకు ప్రభుత్వాలు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్, న్యాయవాది భద్రయ్య కోరారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని డీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం వేసవిలోనే ప్రమోషన్లు, బదిలీలు, నియామకాలు క్యాలెండర్ ప్రకారం నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో సామాజిక అధ్యయన వేదిక కోకన్వీనర్ రేపాక లింగయ్య, సీనియర్ న్యాయవాదులు తల్లమల్ల హసేన్, అశోక్, సీహెచ్ రమణాచారి, దంతాల రాంబాబు, కరీం, నర్సయ్య పాల్గొన్నారు.

పుట్టు వెంట్రుకలు తీయించేందుకు వెళ్తుండగా..

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

- ఆరుగురి దుర్మరణం, నలుగురికి గాయాలు
- కోదాడ మండలం శ్రీరంగాపురం శివారులో జాతీయ రహదారిపై ఘటన
- మృతులంతా రెండు కుటుంబాల వారు..
- స్వగ్రామాల్లో విషాదఛాయలు



శ్రీరంగాపురం శివారులో లారీని ఢీకొట్టిన కారు



గాయాలతో బయటపడిన చిన్నారులు



కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులతో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే



కోదాడ ఆస్పత్రి వద్ద రోదిస్తున్న బంధువులు

కోదాడరూరల్ : చిన్నారికి పుట్టువెంట్రుకలు తీయించడంతో పాటు చెవులు కుట్టించేందుకు రెండు కుటుంబాలు ఆనందంగాబయలుదేరాయి. మరో గంటలో గమ్యస్థానానికి చేరుకుంటారనగా మృత్యువు కబళించింది. ఇరు కుటుంబాలకు చెందిన ఆరుగురు మృతి చెందిన ఈ విషాదకర సంఘటన కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం శివారులో చోటు చేసుకుంది. వివరాలిలా.. కోదాడ మండలం చిమిర్యాలకు చెందిన జిల్లా శ్రీకాంత్ (32)కు తల్లిదండ్రులు లేరు. తన తమ్ముడితో కలిసి 20 ఏళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్ వెళ్లాడు. మణికొండలో నివాసం ఉంటూ ఓ బిల్డర్ వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య నాగమణి, లాస్య, లావణ్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరితో పాటు ఖమ్మం జిల్లా బోనకల్ మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన అత్తామామల కుటుంబం కూడా మణికొండలోనే నివాసం ఉంటుంది. కాగా శ్రీకాంత్ చిన్న కూతురు లావణ్యకు పుట్టు వెంట్రుకలు తీయించడంతో పాటు చెవులు కుట్టించేందుకు గురువారం ఉదయం అత్తామామల కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడలోని గుణదల మేరీమాత చర్చికి బయలుదేరారు.

ఉదయం ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని..

ఉదయం ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని భావించిన శ్రీకాంత్.. బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో విజయవాడకు బయలుదేరారు. తన కుటుంబ సభ్యులను, సమీపంలో ఉంటున్న అత్తామామల కుటుంబీకులు ఆరుగురిని కారులో ఎక్కించుకొని మణికొండ నుంచి బయలుదేరారు. కొంతదూరం వచ్చిన తర్వాత శ్రీకాంత్ తన బావమరిది కృష్ణంరాజును కారు డ్రైవింగ్ చేయమని ఇచ్చాడు. మార్గమధ్యలో చిమిర్యాల గ్రామంలో శ్రీకాంత్ పెద్దమ్మ కుమారిని తమవెంట తీసుకెళ్దామనుకున్నారు. అయితే మిర్యాలగూడెం నుంచి విజయవాడలోని హనుమాన్ జంక్షన్‌కు వెళ్తున్న లారీ మరమ్మతులకు గురవడంతో శ్రీరంగాపురం వద్ద హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారిపై నిలిపారు. రోడ్డుపై ఆపిన లారీని వెనకనుంచి వేగంగా వచ్చిన వారి కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కృష్ణంరాజు(26), అతని భార్య స్వర్ణకుమారి(23), తల్లిదండ్రులు రాంచందర్‌రావు(50), మాణిక్యమ్మ(45)తో పాటు శ్రీకాంత్(32), అతని పెద్ద కుమార్తె లాస్య(4) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతదేహాలను కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చిమిర్యాలలో విషాదం

శ్రీకాంత్, అతని కుమార్తె లాస్య మృతితో చిమిర్యాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీకాంత్‌కు తల్లిదండ్రులు లేకపోవడంతో బంధువుల సహకారంతో అతని సోదరుడితో కలిసి హైదరాబాద్‌లో అనేక ఇబ్బందులతో జీవితం గడిపారు. ఎనిమిదేళ్ల క్రితం శ్రీకాంత్ వివాహం చేసుకుని సంతోషమైన జీవితం గడుపుతున్న తరుణంలో ఇలా జరిగిందని అతని స్నేహితులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. సాయంత్రం తండ్రి, కూతురు మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ, ఆర్డీఓ

సంఘటన స్థలాన్ని ఎస్పీ రాహుల్‌హెగ్డే, ఆర్డీఓ సూర్యనారాయణసందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ రాములను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు.


ఎమ్మెల్యే సంతాపం


రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందిన సంఘటన పట్ల కోదాడ ఎమ్మెల్యే పద్మావతి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అనాథలుగా ఇద్దరు చిన్నారులు



గోవిందాపురంలో మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు





అనాథలుగా మారిన కార్తీక్, కౌశిక్

రాంచందర్‌రావుకు కుమార్తె నాగమణి, కుమారుడు కృష్ణంరాజు ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో రాంచందర్‌రావు, అతని భార్యతో పాటు కొడుకు, కోడలు స్వర్ణకుమారి కూడా మృతి చెందారు. కుటుంబంలోని పెద్దలంతా మృతి చెందడంతో కృష్ణం రాజు ఇద్దరు పిల్లలు కౌశిక్, కార్తీక్ అనాథలుగా మిగిలారు. ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందడంతో ఖమ్మం జిల్లా గోవిందాపురంలో విషాదం అలుముకుంది. మృతదేహాలకు సాయంత్రం అంత్యక్రియలు పూర్తి చేశారు.

నాలుగు రోజుల్లో 8 మంది మృతి

జాతీయ రహదారులపై అడ్డగోలుగా పార్కింగ్ చేస్తున్న వాహనాలు మృత్యు శకటాలుగా మారుతున్నాయి. తరచూ ప్రమాదాలు చోటు చేసుకొని నిండు ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. నాలుగు రోజుల వ్యవధిలోనే సూర్యాపేట జిల్లా పరిధిలో జాతీయ రహదారిపై రెండు ప్రమాదాలు జరిగిన ఎనిమిది మంది మృతి చెందారు. ఈనెల 21న మునగాల మండలం ముకుందాపురం శివారులో రోడ్డుపై ఆగి ఉన్న కంటైనర్ కిందికి కారు దూసుకెళ్లడంతో నవీన్‌రాజ్, భార్గవి అనే దంపతులు దుర్మరణం పాలయ్యారు. గురువారం కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం గ్రామ శివారులో జరిగిన మరో ఘటనలో ఆరుగురు మృత్యువాత పడ్డారు.



సోమవారం ముకుందాపురం వద్ద కంటైనర్ కిందికి దూసుకెళ్లిన కారు

• రెండో రోజు బస్సు యాత్రలో..


భువనగిరి పట్టణంలో నిర్వహించిన రోడ్‌షోలో అభివాదం చేస్తున్న మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్


భువనగిరి పట్టణంలో బస్సు యాత్రకు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు


గులాబీ తలపాగాలు ధరించి కేసీఆర్ రాక కోసం ఎదురుచూస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు , కార్యకర్తలు


భువనగిరి పట్టణంలో రోడ్‌షోకు బస్సులో వస్తున్న కేసీఆర్, ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్

తనయుడి గెలుపు కోసం తండ్రి ప్రచారం


ఎం. తుర్కపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న చామల వాసుదేవరెడ్డి

వలిగొండ: కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం ఆయన తండ్రి చామల వాసుదేవరెడ్డి గురువారం వలిగొండ మండలంలోని ఎం. తుర్కపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి తన కుమారుడు కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ తుమ్మల పద్మమ్మ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తుమ్మల యుగేంధర్‌రెడ్డి, బట్టు ఎల్లయ్య, పల్సం పాండరి, బట్టు రాజు, పల్సం రవి, గుండు జగన్మోహన్‌రెడ్డి, గుండు వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నల్లగొండ జిల్లాకు ఎన్నికల పరిశీలకుల నియామకం


మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ


అమోఘ్ జీవన్ గాంకర్

నల్లగొండ: జిల్లాకు ఎన్నికల పరిశీలకులను కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నియమించింది. నల్లగొండ జిల్లాకు లోక్‌సభ ఎన్నికల సాధారణ పరిశీలకుడిగా ఐఏఎస్ అధికారి(2010 బ్యాచ్) మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ నియమితులయ్యారు. ఆయన నల్లగొండ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బస చేస్తారు. 9867383846 నంబర్‌లో అందుబాటులో ఉంటారు. అదేవిధంగా పోలీసు పరిశీలకుడిగా ఐపీఎస్ అధికారి(2011 బ్యాచ్) అమోఘ్ జీవన్ గాంకర్ నియమితులయ్యారు. ఈయన పోలీస్ అతిథి గృహంలో బస చేస్తారు. 9922924971 నంబర్‌లో అందుబాటులో ఉంటారు. ఇదివరకే జిల్లాకు ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా ఐఆర్‌ఎస్ అధికారి కళ్యాణ్ కుమార్ దాస్(2012 బ్యాచ్) నియమితులైన విషయం తెలిసిందే. మనోజ్‌కుమార్ మాణిక్ రావు సూర్యవంశీ, అమోఘ్ జీవన్ గాంకర్‌కు కలెక్టర్ దాసరి హరిచందన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. వారికి స్వాగతం పలికిన వారిలో ఎస్పీ చందనాదీప్తి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ కుటుంబం జైలుకెళ్లడం ఖాయం


రామన్నపేట: అభివాదం చేస్తున్న ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశం, ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నేతి విద్యాసాగర్‌రావు


మోత్కూరు: ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మందుల సామేల్, ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

- కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మోత్కూరు: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని బొంద పెట్టామని, అవినీతి, అక్రమాలకు పాల్పడిన కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మోత్కూరులో గురువారం సాయంత్రం ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డిలతో కలిసి రోడ్డు షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ప్రధాన మంత్రి రాహుల్‌గాంధీయేనని, ఆ కోటరీలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని ఉంచే బాధ్యత భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ప్రజలదేనని అన్నారు. కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి రాష్ట్రాన్ని దోచుక తిన్నాడని విమర్శించారు. త్వరలో తనకు హోం మంత్రి పదవి రాబోతుందని, కేసీఆర్ కుటుంబంతో పాటు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపుతామని అన్నారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. బూర నర్సయ్యగౌడ్ గతంలో ఎంపీగా ఉండి చేసిన అభివృద్ధి ఏమీ లేదని అన్నారు. బీజేపీ ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచి పెట్టిందని విమర్శించారు. ఆగస్టు 15 వరకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామనని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. మోత్కూరు మండలం నుంచి కిరణ్‌కుమార్‌రెడ్డికి భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి పున్న కైలాస్ నేత, కోఆరి ్నేటర్ బాలలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పైళ్ల సోమిరెడ్డి, గుర్రం లక్ష్మీనర్సింహ్మారెడ్డి, అవిశెట్టి అవిలుమల్లు, మండల, పట్టణ అధ్యక్షులు వంగాల సత్యనారాయణ, గుండగోని రామచంద్రుగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి రాచకొండ బాలరాజు గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శులు కారుపోతుల వెంకన్న, మందుల సురేష్, మహిళా నాయకులు అన్నెపు పద్మ, ముద్దం జయశ్రీ, పోలినేని ఆనందమ్మ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తాం

రామన్నపేట: ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాలువలను పూర్తిచేసి ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తామని మునుగోడు, నకిరేకల్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తరఫున రామన్నపేట మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన రోడ్ షోలో వారు మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కాలువల పనులు ముందుకు సాగలేదని, 2014లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి నిధులు ఇవ్వకపోయినా సొంత డబ్బులతో కాలువలను బాగుచేసి చెరువులను నింపినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో పేదలకు భూములు, ఇళ్లు రాలేదని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించలేదని ఆరోపించారు. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోతుందని అన్నారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి నకిరేకల్ నియోజకవర్గం నుంచి లక్ష ఓట్ల మెజార్టీ అందించాలని కోరారు. అనంతరం ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గెలుపుతోనే పేదల బతుకులు బాగుపడతాయని అన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే సేవకుడిగా ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. ఇంద్రపాలనగరం, బోగారం, వెల్లంకి, సిరిపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, టీపీసీసీ నాయకులు పున్న కై లాస్‌నేత, వెంకటరమణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, ఎంపీపీ పూస బాల మణినర్సింహ, జెడ్పీటీసీ పున్న లక్ష్మీజగన్మోహన్, మందడి రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

రిక్షాపై వచ్చి నామినేషన్ పత్రాల అందజేత



భువనగిరి ఎంపీ అభ్యర్థిగా శివసేన పార్టీ బలపర్చిన పూస శ్రీనివాస్ బుధవారం నామినేషన్ దాఖలు చేశాడు. అయితే అధికారుల సూచన మేరకు నామినేషన్‌కు అవసరమైన మరికొన్ని పత్రాలను జత చేసేందుకు గురువారం ఆయన రిక్షా తొక్కుకుంటూ భువనగిరి కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు.
– భువనగిరిటౌన్

మూడోసారి కూడా మోదీనే ప్రధాని

- భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్


ఓటు అభ్యర్థిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

రామన్నపేట: మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని మునిపంపుల, దుబ్బాక గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం మండలకేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలు భువనగిరి భవిష్యత్‌ను నిర్ణయించేవన్నారు. భువనగిరి అభ్యర్థి ఎవరో కాంగ్రెస్‌పార్టీ చెప్పుకోలేని పరిస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తే వృథా అవుతాయన్నారు. ఢిల్లీలో, గల్లీలో లేని బీఆర్‌ఎస్‌ను ప్రజలు పట్టించు కోవడం లేదన్నారు. యాదాద్రి వరకు మెట్రోరైలు విస్తరణ, రాచకొండను పర్యాటకకేంద్రంగా తీర్చిదిద్దడం, ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేయడం, చిట్యాల–భువనగిరిరోడ్డును విస్తరించడం, బీబీనగర్ ఎయిమ్స్‌ను అభివృద్ధి చేయడం తన లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో నాయకులు నకిరేకంటి మొగులయ్య, మైల నర్సింహ, మదూరి ప్రభాకర్‌రావు, వనం అంజయ్య, కన్నెకంటి వెంకటేశ్వరాచారి, ఏలూరి శ్యాం, దావనూరి వెంకటేశం, డోగిపర్తి సుభాస్, బండ మధుకర్‌రెడ్డి, పల్లపు దుర్గయ్య, జంగిలి సత్యనారాయణ, రాజ్‌కుమార్, లింగస్వామి, అంజయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి ఘన స్వాగతం


మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి స్వాగతం పలుకులున్న నాయకులు

నకిరేకల్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఉదయం హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తూ నకిరేకల్ బైపాస్‌లో కొద్దిసేపు ఆగారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి పుష్ప, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ గాజుల సుకన్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో కౌన్సిలర్లు పన్నాల పావనీశ్రీనివాస్‌రెడ్డి, చౌగోని రజితాశ్రీను, యాసారం లక్ష్మీవెంకన్న, కందాల భిక్షంరెడ్డి, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, పన్నాల రంగమ్మ, గండమల్ల లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

సమీకృత వ్యవసాయంతో అధిక లాభాలు

- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

త్రిపురారం : వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులు ఒక పంటపైనే ఆధారపడకుండా సమీకృత వ్యవసాయం చేయడంతో అధిక లాభాలు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. కేవీకేను స్థాపించి 50వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం మండలంలోని కేవీకే కంపాసాగర్‌లో స్వర్ణోత్సవ వేడుకలను వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంటల్లో ఉత్పత్తులు పెంచడం, నూతన పద్ధతులు, సాంఘిక, ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడానికి, రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాలపై అవగాహన కల్పిస్తూ విజ్ఞానాన్ని పెంచడమే కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) లక్ష్యమన్నారు. పంట ఉత్పత్తుల మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఎక్కువగా రైతులు ఆధారపడి పండిస్తున్న పంటలపై శాస్త్రవేత్తలు పరిశోధన చేసి పరిజ్ఞానాన్ని అందిస్తున్నామని, వ్యవసాయంలో నూతన ఒరవడిని రైతులు అందిపుచ్చుకోవడానికి శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్, సస్య రక్షణ శాస్త్రవేత్త రాములమ్మ, విస్తరణ శాస్త్రవేత్త పల్లవి, త్రిపురారం వ్యవసాయ అధికారి పార్వతి చౌహాన్, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

మే 1న దాసి సుదర్శన్ సంస్మరణ సభ


దాసి సుదర్శన్ (ఫైల్)

నాగార్జునసాగర్ : బహుముఖ ప్రజ్ఞాశాలి, చిత్రకళాగురువు దాసి సదర్శన్ సంస్మరణ సభను నాగార్జునసాగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల కళాభారతి సమావేశ మందిరంలో మే 1వ తేదీన నిర్వహిస్తున్నట్లు సహచరులు, నిర్వాహకులు తెలిపారు. ఆ కళాశాలతో దాసి సుదర్శన్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన చాలాకాలం వరకు సాగర్‌లోనే నివాసమున్నప్పటికీ చివరిదశలో మిర్యాలగూడ వెళ్లారు. అక్కడ ఆయన ఏప్రిల్ 1న గుండెపోటుతో మరణించారు. సాగర్ జూనియర్ కళాశాలలో పనిచేస్తూ ఎంతో మంది విద్యార్థులను కళలు, సాహిత్యం వైపు మళ్లించి మంచి నిష్ణాతులను చేశారు. సినీ పరిశ్రమలోనూ మంచి పేరుప్రఖ్యాతలు సంపాదించారు. ప్రముఖ దర్శకుడు బి.నర్సింగరావు తీసిన సినిమాలకు కళాదర్శకుడిగా, క్యాస్టూమ్స్ డిజైనర్‌గా పనిచేశారు. నర్సింగ్‌రావు తీసిన ×దాసి¤ సినిమాకు సుదర్శన్‌కు క్యాస్టూమ్ డిజైనర్‌గా జాతీయ అవార్డు దక్కింది. ఈ అవార్డుతోనే పిట్టంపల్లి సుదర్శన్ కాస్త దాసి సుదర్శన్‌గా మారాడు. దాసి సుదర్శన్ సంస్మరణ సభకు ప్రముఖులు హాజరవుతున్నట్లు అతడి సహచరులు, స్నేహితులు పేర్కొన్నారు.

మార్కులు తక్కువగా వచ్చాయని విద్యార్థిని ఆత్మహత్య


గీతాంజలి (ఫైల్)

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో మార్కులు తక్కువ రావడంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన తిరుమలగిరి సాగర్ మండలంలోని సుంకిశాలతండాలో గురువారం వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సుంకిశాలతండాకు చెందిన కోడావత్ హనుమంతు–జ్యోతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. హనుమంతు వ్యవసాయం చేస్తుండగా జ్యోతి అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. వారి పెద్ద కుమార్తె కోడావత్ గీతాంజలి(17) మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్‌లోని బీసీ గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం(బైపీసీ) చదువుతోంది. బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో గీతాంజలికి 275 మార్కులు వచ్చాయి. మార్కులు తక్కువగా రావడంతో ఆమె మనస్తాపానికి గురైంది. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో తల్లిదండ్రులు నిద్రపోయిన విషయాన్ని గమనించి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గీతాంజలి బాబాయ్ కూతురు గమనించి ఆమె తల్లిదండ్రులను నిద్రలేపగా అప్పటికే మృతిచెందింది. పదో తరగతి ఫలితాల్లో గీతాంజలి ఉత్తమ మార్కులు సాధించిందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతురాలి దహన సంస్కారాలు బుధవారం రాత్రే ముగిశాయి.

రోడ్డు ప్రమాద బాధితులకు ఎస్పీ సహాయం


గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న ఎస్పీ

సూర్యాపేట: పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు వద్ద సర్వీస్ రోడ్డుపై గురువారం లారీ, బైక్ ఢీకొన్నాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే గమనించి ప్రమాదంలో గాయపడ్డ ఇద్దరు వ్యక్తులను ఆటోలో ఆస్పత్రికి తరలించారు. ఎస్పీ వెంట ఎలక్షన్ సెల్ ఎస్ఐ విష్ణుమూర్తి ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

నేరేడుచర్ల: గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందింది. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున నేరేడుచర్లలో జరిగింది. నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలంలోని పెంచికల్‌దిన్నె గ్రామానికి చెందిన బొల్లెద్దు జానకమ్మ(50) జడ్చర్ల–కోదాడ ప్రధాన రహదారి రోడ్డు వెంట నడుచుకుంటూ గరిడేపల్లి మండలంలోని అప్పన్నపేటలో గల తన తమ్ముడు వెళ్తుంది. ఈ క్రమంలో నేరేడుచర్ల మండల కేంద్రంలో గుర్తుతెలియని వాహనం ఆమెను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు సంపత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భువనగిరి ఖిలాపై మంటలు

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని వినాయక నగర్ సమీపంలో భువనగిరి ఖిలాపై గురువారం మంటలు చెలరేగాయి. ఆందోళనకు గురైన స్థానికులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కాగా గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేయడం వల్ల మంటలు అంటుకుని ఉంటాయని అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

భూదాన్‌పోచంపల్లి : ఒడిషా రాష్ట్రంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో తెలంగాణ అభ్యర్థులకు కేటాయించిన 9సీట్లకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని చేనేత జౌళిశాఖ జిల్లా ఏడీ విద్యాసాగర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 3సంవత్సరాల డిప్లొమా కోర్సుకు పదోతరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. 16–07–2024 నాటికి బీసీ, జనరల్ కేటగిరీలలో 15నుంచి 23మధ్య వయస్సు కలిగి ఉండాలని, ఎస్సీ, ఎస్టీలకు 15–25 మధ్య వయస్సు వరకు ఉండవచ్చన్నారు. ఒక సీటు ఈడబ్ల్యూఎస్ కేటగిరికి రిజర్వు చేయబడిందని, ఆసక్తి కల్గిన వారు జూన్ 10లోపు ప్రిన్సిపల్ ఎస్‌పీకేఎం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ వెంకటగిరి–524132 చిరునామాకు పంపించాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా చేనేత జౌళి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కమిషనర్‌లోని టెక్స్‌టైల్ డిపార్ట్‌మెంట్ వారు 2024 సంవత్సరానికి గాను సంత్‌కబీర్ అవార్డు, నేషనల్ హ్యాండ్లూమ్ అవార్డు కోసం చేనేత రంగంలో విశేష కృషి చేస్తున్న చేనేత కార్మికులు, డిజైనర్లు, మార్కెటర్లు మే 20లోపు www.handlooms.nic.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో త్రిఫ్టు కట్టుకొనే చేనేత కార్మికులతో పాటు, అనుబంధ కార్మికులు టీ–నేతన్న యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తమ వివరాలను ఈనెల 30లోపు నమోదు చేసుకోవాలని కోరారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో 2 నెలల కాలపరిమితి కల్గిన బ్యూటీషియన్ కోర్సులో నిరుద్యోగ యువతులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి పాసై ఉండి, 18 నుంచి 30ఏళ్ల వయస్సు కల్గి ఉండాలని అన్నారు. ఆసక్తి కల్గిన వారు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో మే 1వ తేదీన నేరుగా హాజరు కావాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి ఉచిత హాస్టల్, భోజన వసతి కూడా కల్పించబడుతుందని అన్నారు. మరిన్ని వివరాలకు 9133908000, 9133908111 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సాక్షి స్పెల్‌బీ కాంటెస్ట్‌లో విద్యార్థి ప్రతిభ


స్పెల్ బీ కాంటెస్ట్‌లో వెండి పతకం సాధించిన హర్ష

మిర్యాలగూడ : హైదరాబాద్‌లోని సాక్షి స్టూడియోలో గురువారం నిర్వహించిన సాక్షి ఇండియా స్పెల్‌బీ కాంటెస్ట్ ఫైనల్‌లో మిర్యాలగూడ పట్టణంలోని వర్డ్ అండ్ డీడ్ ప్రైమరీ స్కూల్ విద్యార్థి జి.హర్ష కేటగిరి–2లో వెండి పతకం, సర్టిఫికెట్ సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎండీ.ఖలీమ్ వెల్లడించారు. వివిధ దశల్లో జరిగిన రౌండ్లలో విద్యార్థి హర్ష ప్రతిభ చూపి విజేతగా నిలిచాడని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి హర్షను పాఠశాల డైరెక్టర్లు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వలిగొండ : గడ్డి మందుతాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని నాతాళ్లగూడెంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోరబోయిన కృష్ణ(29) ప్రైవేట్‌గా ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం స్వగ్రామానికి వచ్చిన కృష్ణ ఇంటి నిర్మాణం విషయంలో మానసికవత్తిడి తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది రైల్వే ట్రాక్ సమీపంలో గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గడ్డి మందుతాగి అపస్మారక స్థితిలో పడి ఉన్న కృష్ణను స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అతడు చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కాంగ్రెస్‌తోనే సమాచార హక్కు చట్టం సాధ్యమైంది

- డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న వర్రె వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సమాచార హక్కు చట్టం సాధ్యమైందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే ఎన్నో చట్టాలు వచ్చాయన్నారు. వాటిలో ప్రధానమైనవి లోక్‌పాల్ చట్టం, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం, గృహహింస చట్టం, ఉపాధిహామీ పథకం ఇలా అనేక సంక్షేమ పథకాలు అమల్లోకి వచ్చాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత ఉండేందుకు, ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించేందుకు సమాచార హక్కు చట్టం వచ్చిందని ఆయన తెలిపారు. సమాచార హక్కు చట్టంతోనే సమాజంలో జరుగుతున్న అవినీతిని బయటకు తీసేందుకు ఆర్టీఐ కార్యకర్తలు నిత్యం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆర్టీఐ చట్టం అమల్లోకి వచ్చిన తరువాత 140కోట్ల మంది ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం అధికారులకు ఏర్పడిందన్నారు. సమాచార హక్కు చట్టం కమిషనర్లను త్వరలో నియమిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షనీయమన్నారు. అనంతరం సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యరమాద కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాలనలో పారదర్శకత ఉండాలంటే ఆర్టీఐ కార్యకర్తలు కీలకమన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలన్నారు. రిటైర్డ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ పంచాయతీరాజ్ ఎంఏ కరీం మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం పారదర్శక పాలన కోసం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో సమితి రాష్ట్ర గౌరవ సలహాదారు కోటగిరి దైవాదీనం, జిల్లా అధ్యక్షుడు గుంటకండ్ల ముకుందారెడ్డి, జిల్లా కార్యదర్శి చేకూరి శివ, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బైరు సైదులు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు జోసఫ్‌రెడ్డి, శంకర్, పుల్లయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.